ప్రతి పేద కుటుంబానికి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

పాపన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:

ప్రతి పేదకుటుంబానికి వైద్యసేవలు అందించాలన్నదే ప్రభుత్వలక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన పాపన్నపేట పిహెచ్‌సిలో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలోని వివిధవిభాగాలను పరిశీలించి, రోగులకు అందజేస్తున్న వైద్యసేవల గురించి వైద్యు లను అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలనలో భాగంగా గ్రామస్థాయిలో ఇలాంటి ఆరోగ్యమేళాలు నిర్వ హించడంద్వారా సామాన్యప్రజలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. ప్రాంతాలవారీగా ప్రజల ఆరోగ్య పరిస్థితిని అంచనావేయడానికి ప్రత్యేక మెడికల్‌డేటాను తయారుచేస్తున్నారని సూచించారు. కలెక్టర్ వెంట సర్పంచి పావని నరేందర్‌గౌడ్, ఉపసర్పంచి సద్దాం హుసేన్, డిప్యూటీ డిఎంహెచ్వో హరి ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ అన్వర్, సిహెచ్‌ఓ చందర్, మెడికల్ సిబ్బంది, మాజీ ఉపసర్పంచి వివిధ గ్రామాలనుండి విచ్చేసిన రోగులు, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

కంపుకొడుతున్న మెదక్ బస్ డిపో పరిసరాలు

-పారిశుధ్య లోపం డిపో మేనేజర్ నిర్లక్ష్యం

మెదక్, మార్చి 17, ప్రభాతవార్త:

మెదక్ జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్‌డిపో, బస్‌స్టాప్ పరిసరప్రాంతాలు కంపుకొడుతున్నాయి. ప్రయాణ ప్రాంగణంలో పారిశుధ్యం లోపించింది. డిపో ప్రాంగణమంతా చెత్త, మురుగు నీరు పేరుకుపోవడం, దుర్వాసన వెదజల్లడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో చాలామంది ప్రయాణికులు బహిరంగప్రదేశంలో మూత్రవిసర్జన చేస్తున్నారు. శుభ్రత లేక పోవడంవల్ల దుర్వాసనవ్యాపించి ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ప్రయాణికులు, స్థానికులు పలు మార్లు ఫిర్యాదుచేసినా, డిపోమేనేజర్ నుంచి ఎలాంటిస్పందన కనిపించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతుందని, డిపోకు, గుర్తింపుబోర్డు కూడా ఏర్పాటుచేయకపోవడంతో కొత్తగా వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, తక్షణమే పారిశుధ్యపనులు చేపట్టి, సరైన గుర్తింపుబోర్డు ఏర్పాటుచేయాలని, అధికారులు సమస్యను పరిష్కరించకపోతే పట్టణప్రజలు ఆందోళనలుచేపడతామని హెచ్చరిస్తున్నారు.

భూభారతి భూముల రీసర్వేకు సహకరించాలి

-వల్లూరు అవగాహన సభలో కలెక్టర్ ప్రావీణ్య

భూభారతి భూముల రీసర్వే కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

నాగల్‌గిద్ద, మార్చి 17, ప్రభాతవార్త:

భూభారతి భూముల రీసర్వేకు రైతులు తమవంతు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. మంగళవారం మండలపరిధిలోని కొల్లూరులో ఏర్పాటుచేసిన అవగాహన కార్య క్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై అన్నదాతలను ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామసరిహద్దులను గుర్తిం చడంతోపాటు గ్రామనక్ష లేనందున గ్లోబల్ ద్వారా సర్వేను రెవిన్యూ సిబ్బంది చేపడతారన్నారు. గ్రామంలో ఏసమస్య ఉన్నా, తనదృష్టికి తీసుకురావాలని ప్రజలకు కలెక్టర్ సూచించారు. గ్రామం లో నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, ఎంపిడిఓ మహేశ్వరరావు, నాయబ్ తహసీ ల్దార్ శివరామకృష్ణ, ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సర్వే సమస్యల పరిష్కారానికే రీసర్వే

-సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతి

భూభారతి భూముల రీసర్వే కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఎన్.ఉమాహారతి

మనూర్, మార్చి 17, ప్రభాతవార్త:

మండలపరిధిలోని దూదిగొండ పంచాయతీ పరిధిలోని హామ్లెట్‌గ్రామ గట్టులింగంపల్లిలో మంగళ వారం ఏర్పాటుచేసిన భూభారతి భూముల రీసర్వే అవగాహన సదస్సుకు సబ్ కలెక్టర్ ఎన్.ఉమా హారతి హాజరై రైతులకు అవగాహన కల్పించారు. గట్టులింగంపల్లిలో భూసమస్యలను, సర్వే సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తుచేశారు. త్వరలోనే గట్టులింగంపల్లిలో రీసర్వే కార్యక్రమం ప్రారంభం అవుతుందని, రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ బిక్షపతి, గ్రామసర్పంచి చంద్రలీల, ఉపసర్పంచి ప్రతిభ అనిల్‌పటేల్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్‌కుమార్, రెవిన్యూ ఆర్‌ఐ రామచందర్, జీపిఓ షబ్బీర్, పంచాయతీ కార్యదర్శి గణపతి, రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభకు తగిన ఏర్పాట్లుచేయాలి

-సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, వ్యవసాయశాఖ కమిషనర్ గోపి

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, వ్యవసాయశాఖ కమిషనర్ గోపి

నంగునూరు, మార్చి 17, ప్రభాతవార్త:

ఈనెల 22వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నర్మెట్ట ఆయిల్‌పామ్ వద్ద ఏర్పాటుచేసే సభకు తగిన ఏర్పాట్లుచేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ గోపిలు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్, రాష్ట్ర వ్యవసా య శాఖ డైరెక్టర్, విజయ ఎండి చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి నంగునూరు మండలం నర్మెట్టలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈసందర్భంగా 22వతేదీన ముఖ్యమంత్రి ఫ్యాక్టరీ ప్రారం భించడానికి అవసరమైన హెలిప్యాడ్ ఏర్పాటు, బహిరంగసభకు స్టేజ్ ఏర్పాటు, రైతుమేళాకు స్టాళ్ల ఏర్పాటు, ఫ్యాక్టరీ ప్రారంభానికి ఫ్యాక్టరీలో చేస్తున్న ఏర్పాట్లు తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. అనంతరం హైమావతి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్య మంత్రి పర్యటనలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా వివిధశాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని, అన్ని కార్యక్రమాలు ప్రోటోకాల్ ప్రకారం ఉండాలని, ఈ కార్యక్రమానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందికలగకుండా త్రాగునీరు, మరుగుదొడ్లతో పాటు అన్నిసౌకర్యాలు కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ ఉపయోగపడే గొప్పకార్యక్రమం ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవమని అన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభంతో పాటు రైతుమేళాకు వచ్చే వేలాదిమంది రైతులు ఆయిల్‌పామ్ తోటల పెంపకం పొందే ప్రయోజనాలను, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి పరిశ్రమ, పశువుల పెంపకం వలన కలిగే ప్రయోజనాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉన్నందున సంబంధిత అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, వ్యవసాయ, ఆర్టికల్చర్, ఆర్‌అండ్‌బి, పోలీస్, ఆయిల్స్‌ఫెడ్, సంబంధిత ఇతరశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులు వందశాతం వసూలుచేయాలి

-జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

గజ్వేల్ టౌన్, మార్చి 17, ప్రభాతవార్త:

వాణిజ్య సముదాయాలకు సంబంధించిన ఆస్తిపన్నులు ఆశించినస్థాయిలో వసూలుచేయడం లేదని, ఆస్తిపన్నును రోజువారి లక్ష్యంగా ఏర్పాటుచేసుకొని వందశాతం వసూలుచేయాలని సిద్ది పేట జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సి పల్ చైర్మన్ గంగిశెట్టి చందనరవీందర్, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్‌తో ఆస్తి పన్నులపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కోటమైసమ్మ రోడ్డు విషయాన్ని మున్సిపల్ చైర్మన్ చందన అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసేందుకు సూచనలు జారీచేశారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పరిధిలోని 11వ వార్డు సంగాపూర్‌లో తడి, పొడి, హానికర చెత్తపై అడిషనల్ కలెక్టర్ ప్రజలకు అవగాహన కల్పించి చెత్త బుట్టలను పంపిణీచేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, స్థానిక కౌన్సిలర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానను తనిఖీచేసిన కలెక్టర్

-ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యసేవలు సమర్థవంతంగా అందించాలి

-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

నారాయణఖేడ్, మార్చి 17, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లాకలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మంగళవారం నారాయణ ఖేడ్‌పట్టణంలోని బస్తీదవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్, శెట్కార్ గ్రౌండ్స్, ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆసుపత్రి లోని ప్రతి విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసు కున్నారు. ప్రతిరోజూ ఓపికివచ్చే రోగులవివరాలపై ఓపిరిజిస్టర్ ను పరిశీలించారు. ఆసుపత్రికివచ్చిన రోగులతో నేరుగా మా ట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. వైద్యు లు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారా, లేదా అన్న విషయాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ గదిలో మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి అవసరమైన అన్ని ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఆసుపత్రిని, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం నారాయణఖేడ్‌లోని శెట్కార్‌గ్రౌండ్స్‌ను సందర్శించి పరిశీలించారు. ఇండోర్‌స్టేడియం నిర్మాణానికి, అవసరమైన మరమ్మతులకు అంచనా ప్రతిపాదనలు సిద్ధంచేసి అందించా లని ఆర్‌అండ్‌బి అధికారులకు సూచించారు. స్టేడియం విని యోగానికి డైలీ రెంట్‌ను నిర్ణయించాలని, స్టేడియం పరిధిలో ఉన్న షాపులరెంట్ బకాయిలను వసూలుచేయాలని షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డిని ఆదేశించారు. తదనంతరం ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహాన్ని సందర్శించి పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న రూఫ్ లీకేజీ, డ్రైనేజీ తదితర మరమ్మతులకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు సిద్ధంచేసి ఇవ్వాలని ఈడబ్ల్యుఐడిసి ఎఈని ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్‌వెంట సబ్‌కలెక్టర్ ఉమాహారతి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి, సర్వేఅండ్‌ల్యాండ్‌రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అవినాష్‌నాయక్, తహసీల్దార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

-సమయం వృథాచేయకుండా శ్రద్ధగా చదువుకోవాలి

-జిల్లా కలెక్టర్ కె.హైమావతి

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

కొండపాక, మార్చి 17, ప్రభాతవార్త:

విద్యార్థులు సమయం వృథాచేయకుండా ఒకలక్ష్యాన్ని ఎంచు కొని శ్రద్ధగా చదవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచిం చారు. మంగళవారం కుకునూరుపల్లి మండలపరిధిలోని లకు డారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఈ నెల 16 నుండి ఒక్క పూట బడి ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉదయం 7.30 గంటలకు ఏమీ తినకుండా వస్తున్నారని అందువల్ల 10.30 గంటలకే అన్నం, కూర, సాంబార్‌తో భోజనం పెట్టినట్లు కలెక్టర్‌కు హెచ్‌ఎం తెలిపారు. అనంతరం ఆమె 10వ తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి ఈ నెల 18న హిందీ పరీక్ష ఉన్నందున బాగాచదివి సమయం వృథాచేయకుండా పరీక్ష రాయాలని సూచించారు. 9వ తరగతి గదిలోకి వెళ్లి ఉదయం ఏమి తిన్నారని అడిగి, వార్షిక పరీక్షలు ఎప్పటి నుండి అని ఆరా తీయగా సాంబారుతో అన్నం తిన్నామని, ఏప్రిల్ 10వ తేదీ నుండి పరీక్షలు ప్రారంభమవుతాయని విద్యార్థులు ఆమెకు తెలిపారు. అన్నం, సాంబారుతో మాత్ర మే పెట్టి సాంబారు, కూర, అన్నం పెట్టినట్లు ఎందుకు చెప్పారని హెచ్‌ఎంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. భోజ నం విషయంలో అబద్ధం చెపుతూ, ఇష్టానుసారంగా వ్యవ హరిస్తే సహించేదిలేదని, ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవని కలెక్టర్ హైమావతి పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు.

రైతులను సిద్ధిపేట జిల్లాకు పంపుతాం

-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

పాపన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:

సంప్రదాయ పంటల కంటె ఆయిల్‌పామ్ పంటతోనే రైతుల కు అధికలాభాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం పాపన్నపేట మండలపరిధిలోని గాం ధారిపల్లి గ్రామంలో రైతులుసాగుచేస్తున్న ఆయిల్‌పామ్ పంట లను జిల్లా ఉద్యానవనశాఖ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ, రైతులు ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తూ ఆయిల్‌పామ్ పంటను సమర్థవంతంగా సాగుచేయాలని సూచించారు. ప్రభు త్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నందున రై తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. అలాగే ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించే దిశగా చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతు లకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీల గురించి అవ గాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు కోసం 2,500 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇప్పటికే 2000 ఎకరాలు సాగు అయిందని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటలసాగు పరిశీలనకోసం ఈనెల 20,21,22 తేదీలలో సిద్దిపేట జిల్లాలోని ఆయిల్‌పామ్ పంటలసాగు పరిశీలనకోసం 70బస్సులు ఏర్పాటుచేసి మెదక్‌జిల్లా రైతులను పంపుతు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ప్రతాప్‌సింగ్, ఉద్యానవన వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతిమాసింగ్

స్కూటర్ డిక్కీ నుంచి 8లక్షలు అపహరణ

సిసి కెమెరాలో రికార్డు అయిన అనుమానిత వ్యక్తుల దృశ్యం

జహీరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:

భూమి రిజిస్ట్రేషన్ కోసం బ్యాంకులో నుంచి 8లక్షల రూపాయలను విత్‌డ్రా చేసుకుని స్కూటర్ డిక్కీలో పెట్టుకుని నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన సం ఘటన మంగళవారం మధ్యాహ్నం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ కె. వినయ్‌కుమార్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని తూంకుంట గ్రామానికి చెందిన మెటల్‌కుంట నరసింహారెడ్డి (55) భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు పట్టణంలోని ఎస్‌బిఐలో 7లక్షల ను, అప్పటికే తనవద్ద ఉన్న 1లక్ష రూపాయలను తనకు చెం దిన మోటర్ సైకిల్ వాహనంలో పెట్టుకుని స్థానికంగా ఉన్న మీసేవాకేంద్రం వద్ద తనగ్రామానికి చెందిన మేతరి భూచ్చ య్యకు చెందిన టివిఎస్‌పై తహసీల్దార్ కార్యాలయానికి మధ్యాహ్నం 1.20 గంటలకు చేరుకుని స్కూటీని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పార్కింగ్ చేసి కార్యాలయంలోపకి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 1.45 నిమిషాలకు డబ్బులకోసం స్కూటీ వద్దకు వచ్చి చూసేసరికి 8లక్షల రూపాయలు కనపడలేదన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సిసి కెమెరాలను పరిశీలించారు. ఈక్రమంలో దొంగతనా నికి సంబంధించి ఇద్దరు వ్యక్తులు అనుమానితులుగా సిసి కెమెరాల్లో గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ వివరించారు.

మంత్రులు, ఎమ్మెల్యేలను ముట్టడిస్తాం

-సిఐటియు రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

ఆశావర్కర్ల ఫిక్స్‌డ్‌వేతనం రూ.18 వేలు నిర్ణయించేంతరవకు పోరాటం చేస్తామని బడ్జెట్ సమావేశంలోనే నిధులు కేటా యిస్తూ నిర్ణయం తీసుకోవాలని లేదంటే మంత్రులు, ఎమ్మెల్యే లను ముట్టడిస్తామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి గోపాల స్వామి హెచ్చరించారు. మంగళవారం రెండోరోజు ఆశా కార్య కర్తలు తమ డిమాండ్ల సాధన కోసం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. దీంతో పోలీసు లకు ఆశాకార్యకర్తల మధ్య స్వల్పతోపులాట జరుగడంతో కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని అధికారులను పిలిపిస్తామని చెప్పడంతో ఆశా కార్య కర్తలు ఆందోళన విరమించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆశావర్కర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రూ.18 వేల వేతనంలో పాటు పిఎఫ్‌ఎస్‌ఐ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాల న్నారు. సిపిఎం నాయకులు రాళ్లబండి శశిధర్, సిఐటియు నాయకులు ఎల్లయ్య, భాస్కర్, చొప్పరి రవికుమార్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బత్తుల అభిషేక్, ఆశా యూని యన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూలక్ష్మీ, ప్రవీణ, కోశాధి కారి భాగ్యలక్ష్మీ, ఆశాకార్యకర్తలు బాలమణి, భాగ్య, శ్రీలత, అంజలి, రమ, కమల, లక్ష్మీ, వాణి, అరుణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ములుగు, మార్చి 17, ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటన కొక్కొండ గ్రామంలో చోటుచేసుకుంది. ములుగు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొక్కొండ గ్రామానికిచెందిన ఆశెల్లి అనురాధ(40) సోమవారం సాయంత్రం 5గంటలకు హైద్రాబాద్‌లో జరిగిన శుభకార్యానికి తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్లారు. రాత్రి 10గంటలకు తిరిగి వస్తుండగా వంటిమామిడి రాజీవ్ రహదారిపై గల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న కల్వర్టును ఢీకొట్టారు. అనురాధ కుమారుడు రిషికేష్ కారు నడుపుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో కుటుంబసభ్యులు అందరూ తీవ్రంగా గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్సనిమిత్తం లక్ష్మక్క పల్లిలోని ఆర్‌విఎం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అనురాధను పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, కూతురు, కుమా రుడు ఉన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ పాఠశాల బస్సు

-అక్కడికక్కడే ఒకరు మృతి, ఒకరి పరిస్థితి విషమం

జగదేవ్‌పూర్, మార్చి 17, ప్రభాతవార్త:

ఓప్రైవేట్‌పాఠశాల బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఒకవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జగదేవ్‌పూర్ మండలపరిధిలోని పీర్లపల్లి గ్రామశివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, జగదేవ్‌పూర్ మండలకేంద్రంలో నిర్వహి స్తున్న సెయింట్ పీటర్స్ ప్రైవేట్‌పాఠశాల బస్సు విద్యార్థులను పాఠశాల నుండి పీర్లపల్లి, వీరారెడ్డి గ్రామాల్లో దించివస్తున్న క్రమంలో బైక్‌పై వెళ్తున్న జగదేవ్ పూర్‌కుచెందిన ఆళ్లకుంట రమేష్(48)ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెంద గా అతనితో ఉన్న మరోవ్యక్తి మల్లయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనను చూసిన కొందరు 108అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అంబులెన్స్ లో గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలైన మల్లయ్య పరిస్థితి విష మంగా ఉన్నట్లు సమాచారం. మృతునికి భార్య రేణుకతోపాటు ఇద్దరు కూతు ర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఇసుక రవాణాపై పోలీసుల దాడులు-ట్రాక్టర్ సీజ్

కోహెడ, మార్చి 17, ప్రభాతవార్త:

కోహెడ పోలీసుస్టేషన్ పరిధిలోని పోరెడ్డిపల్లి గ్రామశివారులోని మోయ తుమ్మెదవాగు నుంచి అక్రమ ఇసుకతవ్వకాలు, రవాణాపై మంగళవారం పోలీ సులు మెరుపుదాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్‌చేశారు. మంద శంకర్‌పై కేసు నమోదుచేసి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్ఐ అభిలాష్ మాట్లాడుతూ అక్రమ ఇసుకరవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠినచర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.

అప్పచెరువులో మునిగి వ్యక్తి మృతి

కొల్చారం, మార్చి 17: ప్రభాతవార్త:

కొల్చారం మండల పరిధిలోని పోతనపల్లి గ్రామానికి చెందిన బోల అంజన్ కుమార్(41) ప్రమాదవశాత్తు చెరువులోమునిగి మృతిచెందిన ఘటన మంగళ వారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోల అంజన్‌కుమార్, లేట్ బుదయకుమారుడు, ముదిరాజ్‌కులానికి చెందినవారు. ఇరిగేషన్ డిపా ర్ట్మెంట్‌లో లస్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉద యం సుమారు 9 గంటలకు డ్యూటీకి వెళ్లి, సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. తరువాత సుమారు 5:15గంటల సమయంలో గ్రామశివారు లోని అప్పచెరువు వద్దకు వెళ్లి కాళ్లుచేతులు కడుక్కుంటుండగా, ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మునిగిపోయాడు. స్థానికులు గమనించేలోపే అతను ప్రా ణాలు కోల్పోయాడు. మృతుడిభార్య బోల యశోద ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

-ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

దుబ్బాక, మార్చి 17, ప్రభాతవార్త:

బంధువుల అంత్యక్రియలకు వచ్చి, ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతున్న ముగ్గురిని వెనకనుంచి గుర్తుతెలియనివాహనం ఢీకొనడంతో, ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన ఘటన దుబ్బాక పట్టణ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం, రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన అనమేని లక్ష్మి(58)అనే మహిళ మండలంలోని బలవంతపూర్లో మృతిచెందిన బంధువు అంత్యక్రియల కోసం సోమవారం వచ్చింది. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం అదే కార్యక్రమా నికి హాజరై, తిరిగివెళుతున్న ఆమెబంధువులు రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండలం నర్మాలకుచెందిన బత్తిని దేవవ్వ, శ్రీహరి దంపతులు ముస్తా బాద్ మీదుగా నర్మాలకు పల్సర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో లక్ష్మి కూడా వారిబండిపై ఎక్కింది. మీరు ముగ్గురు ద్విచక్ర వాహనంపై ముస్తాబాద్ కు వెళ్తుండగా, దుబ్బాక పట్టణ శివారులోని ఒక ప్రైవేటు పాఠశాల సమీపంలో వెనుకనుంచి అతివేగంతో, అజాగ్రత్తగా ముస్తాబాద్‌వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వారిని బలంగా ఢీకొట్టి, వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురికీ తీవ్రగాయాలు కాగా, స్థానికుల సహాయంతో 108 సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మి మృతిచెందింది. గాయాల పాలైన దంపతులకు చికిత్స కొనసాగుతోంది. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనాన్ని గుర్తించి, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ లక్ష్మి సోదరి కుమారుడు నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్న దృశ్యం

దుబ్బాక, మార్చి 17, ప్రభాతవార్త:

తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు ఇంట్లోని బీరువాను పగలగొట్టి దానిలో ఉన్న నగదును ఎత్తుకెళ్లిన ఘటన దుబ్బాక పురపాలికలోని లచ్చపేట 11వ వార్డులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం, లచ్చపేటకు చెందిన ఎండి.ఖాసింబి అనే మహిళ తన కుమారుని కుటుంబంతో కలిసి బీడీలు చుడుతూ, జీవనం కొనసాగిస్తోంది. రోజు మాదిరిగానే సోమవారంరాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం ఇంటికి తాళంవేసి, పక్కనే ఉన్న కుమారుడి ఇంట్లో నిద్రించేందుకు వెళ్ళింది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి తాళంవేసిన ఇంట్లోకి ప్రవేశించిన గుర్తుతెలియని దొంగలు ఇంటిలోపల ఉన్న బీరువాను తెరచి, లాకర్‌ను పగలగొట్టి దానిలో ఉన్న రూ.30వేల నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో, లోపలికివెళ్లి చూడగా, బీరువా తెరిచి ఉండడంతో దానిలో ఉన్న రూ.30వేల నగదును దొంగలు చోరీచేసినట్లు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులు దుబ్బాక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సమాచారం అందుకున్న దుబ్బాక సిఐ రాజేష్, ఎస్ఐ కీర్తిరాజు క్లూస్ టీంతో కలిసి ఆధారా లు సేకరించారు. అనంతరం బాధితురాలు ఖాసింబి ఇచ్చిన ఫిర్యాదుతో దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు.

పండుగలు ప్రజల్లో సామరస్యాన్ని పెంపొందిస్తాయి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న సెట్విన్ మాజీ డైరెక్టర్ ఎస్.ధనరాజ్

అఫ్జల్‌గంజ్, మార్చి 17(ప్రభాతవార్త): పండుగలు ప్రజల్లో మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని సెట్విన్ మాజీ డైరెక్టర్,సీనియర్ ఖైరతాబాద్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎస్. ధన్‌రాజ్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని భాగ్యనగర్ గూడ్స్ ట్రాన్స్ ఫోర్ట్ అసోసియేషన్ అధ్యక్షులురిజ్వాన్ హుస్సేనీ ఆధ్వర్యంలో ఉస్మాన్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయనపాల్గొన్ని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.అనంతరం ముస్లీం సోదరులకు పండు తినిపించిఇ ఉపవాసదీక్షలను విరమింపచేశారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో రంజాన్ తోఫాలు అందజేత

రంజాన్ తోఫాలను అందిస్తున్న దేశం శ్రీనివాస్‌గౌడ్.

జూబ్లీహిల్స్, మార్చి 17, ప్రభాతవార్తః రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫాలను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు బంజారాహిల్స్‌లోని ఇందిరానగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత దేశం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. దాదాపు వంద మంది ముస్లింలకు తోఫాలను అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు ప్రభుత్వం ముస్లింలకు ఈతోఫాలను అందిస్తుందన్నారు.ప్రతి ఒక్క ముస్లిం ఇంట ఆనందం ఉండాలనే ఆలోచనతో ఇస్తున్నామన్నారు.కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌కు రూ.18 కోట్ల ప్రత్యేక నిధులు : భానుక నర్మద

విలేకరులతో మాట్లాడుతున్న బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద

కంటోన్మెంట్, మార్చి 17 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు త్వరలోనే కేంద్రం నుంచి రూ.18 కోట్ల ప్రత్యేక నిధులు విడుదల కానున్నాయిని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద తెలిపారు. సోమవారం బోర్డు కార్యాలయంలో విలేకరులతో వివరాలను వెల్లడించారు. కంటోన్మెంట్‌లో వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాల్సిందిగా తాము ఎంపీ ఈటెల రాజేందర్‌కు ప్రత్యేకంగా కోరామన్నారు. సంబంధిత లేఖను ఎంపీ ఈటెల రాజేందర్, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు అందజేశారని చెప్పారు. ఈ క్రమంలో రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కంటోన్మెంట్ బోర్డుకు ప్రత్యుత్తరం అందిందని తెలిపారు. తాము ప్రతిపాదించిన పనులకు సంబంధించి అంచనాల కోసం ఆదేశాలు జారీ చేశారని అన్నారు. త్వరలోనే కంటోన్మెంట్‌కు ఆ నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనికి తోడు ఇటీవలే రూ.14.5 కోట్ల గ్రాంట్ అందిందని, మరో రూ.9 కోట్ల సర్వీసు చార్జీలు కూడా బోర్డుకు అందనున్నాయిని చెప్పారు. టీపీటీ బకాయిల విడుదల కోసం తాము ఎంపీ ఈటెల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. తమ పార్టీకి చెందిన ఎంపీ ఈటెల చొరవతో కంటోన్మెంట్‌లో గణనీయమైన అభివృద్ధి సాగుతోందన్నారు. కార్యక్రమంలో ధనుంజయ చారి, బీఎన్ శ్రీనివాస్, విజయానంద్, అరుణ్, రాకేశ్, రాజమల్లేశ్ ఇతర బీజేపీ నేతలు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు త్వరలోనే పరిష్కారం : మాజీ కార్పొరేటర్

మేడిబావిలో సమస్యలు తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్ సామలహేమ

సికింద్రాబాద్, మార్చి 17 ప్రభాతవార్త: మేడిబావి సీతారాంనగర్‌లో మాజీ కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ పర్యటించారు. డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు ఆమే దృష్టికి తీసుకురాగా ఈ ప్రాంతాన్ని సందర్శించారు ఇప్పటికే నూతన డ్రైనేజీ లైన్ పనులు జరుగుతున్నాయని, ఆ కారణంగా కొంత సమస్య ఉందని, పనులు పూర్తి కాగానే సమస్య పరిష్కారం అవుతుందని ఆమే తెలిపారు. ఈ విషయాన్ని జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వినతిపత్రం అందిస్తున్న చింతల రామచంద్రారెడ్డి, భోజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, ముద్దంగుల శ్రీనివాస్ తదితర నేతలు

జూబ్లీహిల్స్, మార్చి 17, ప్రభాతవార్తః ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై షేక్‌పేట తహసిల్దార్ కార్యాలయంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. బీజేపీ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఎమ్మార్వో కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో, ధరల పెరుగుదలపై నియంత్రణ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని, సంక్షేమ పథకాల అమలులో లోపాలున్నాయని అన్నారు. ప్రజల సమస్యలను గాలికి వదవిలి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు బద్దం మహిపాల్‌రెడ్డి, సారంగుల అమర్‌నాథ్, వెంకటస్వామి, శ్రవణ్‌యాదవ్, పల్లె వీణారెడ్డి, రాఘవరెడ్డి, చంద్రశేఖర్, ముద్దంగుల శ్రీనివాస్, వినయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శివపురి కాలనీ సమస్యలు వేగంగా పరిష్కరిస్తాం : సీతారాం ధూళిపాళ

మణికొండ శివపురి కాలనీలో మీ సమస్య–మా బాధ్యత కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

నార్సింగి, మార్చి 17 ప్రభాతవార్త : మణికొండ ప్రాంతంలో గత మూడు నెలలుగా బిఆర్ఎస్ నాయకులు చేపడుతున్న "మీ సమస్య–మా బాధ్యత" కార్యక్రమానికి ప్రజల వద్ద నుంచి అనూహ్యమైన స్పందన వస్తుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం మణికొండలోని శివపురి కాలనీలో బిఆర్ఎస్ నాయకుల బృందం పర్యటించి, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని, ఎలుకలు మట్టి తవ్వడం వలన నిత్యం దుర్వాసన వస్తుందని, మురుగు నీరు పొంగి పొర్లుతుందని స్థానికులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. శివపురి లేఔట్‌లో ఓపెన్ స్పేస్ ఉన్నా, దానిలో కమ్యూనిటీహాల్ నిర్మించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని, వెంటనే స్థానిక ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీహాల్‌ను నిర్మించి ఇవ్వాలని కోరారు. రోడ్డు నెంబర్ –2 వద్ద ట్రాన్స్‌పార్మర్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, గణేష్ మండపం వద్ద ఓవర్‌హెడ్ కేబుల్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు వివరించారు. వరద నీటిని సులువుగా దిగువకు మోసుకెళ్లే బుల్కాపూర్ నాలా చెత్తతో నిండిపోయిందని, ఆర్టీఏ కార్యాలయం వలన తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, రోడ్డు దాటేందుకు మహిళలు, పిల్లలు నరకయాతన పడుతున్నారని శివపురి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లారా చూసి సంబంధిత శాఖల అధికారుల దృష్టికి ఆ సమస్యలను తీసుకెళ్లి, వేగంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కారణంగానే మీ సమస్య–మా బాధ్యతకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. శివపురి కాలనీ సమస్యలన్నింటిని త్వరలోనే పరిష్కరింపచేసేందుకు బిఆర్ఎస్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కుంభగళ్ల ధన్‌రాజ్, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావ్, ఏర్పుల శ్రీకాంత్, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, జైరామ్, భానుచందర్, సుమనళిని, రాజేంద్రప్రసాద్, బొడ్డు శ్రీధర్, తిరుపతి, మంజు,దేవిప్రియ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ బిల్లును వెనక్కి తీసుకోవాలి

సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ట్రాన్స్‌జెండర్ పీపుల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చిక్కడపల్లి మార్చి 17 (ప్రభాతవార్త) : కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 2026 ట్రాన్స్‌జెండర్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, ఇది ట్రాన్స్‌జెండర్ల అస్తిత్వంపై కేంద్రం చేస్తున్న అప్రకటిత యుద్ధమని తెలంగాణ ట్రాన్స్‌జెండర్ పీపుల్స్ అసోసియేషన్ , తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ధ్వజమెత్తాయి. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంయుక్త సమావేశంలో ఈ బిల్లుకు వ్యతిరేక నిరసన గళం విప్పారు. సమావేశంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మోనాలిసా మాట్లాడుతూ 2014లో సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక నల్సా తీర్పును గౌరవించకుండా కేంద్రం ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరిస్తోంది. స్వీయ గుర్తింపు హక్కును లాగేసుకోవడం రాజ్యాంగ ఉల్లంఘనే. హక్కులను కాలరాసే ఏ చట్టాన్నయినా తిప్పికొట్టడం మా ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. హక్కుల అణచివేత కొనసాగితే ప్రభుత్వం కాలగర్భంలో కలిసిపోతుందని ఆమె హెచ్చరించారు. ఆల్ ఇండియా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ప్రతినిధి రచన ముద్రబోయిన మాట్లాడుతూ, కొత్త నిబంధనలు ట్రాన్స్‌జెండర్లను మరింత వివక్షకు గురిచేసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉనికిని కాపాడుకోవడానికి ఐక్యంగా పోరాడతామని పిలుపునిచ్చారు. టిపి ఎస్ కె రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ట్రాన్స్‌జెండర్లకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రక్షణ కల్పించాలే తప్ప అణచివేతకు గురిచేయకూడదని డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ (ఇందిరా పార్క్) వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. త్వరలోనే మేధావులు, ప్రజాసంఘాలు, సామాజిక సంఘాల సహకారంతో రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్తలు రింకు, పప్పీ, సోనా రాథోడ్, అక్షర, నిత్య, వాసవి, శృతి, సిల్క్ అప్పు, అభి తదితరులు పాల్గొని ప్లే కార్డ్స్‌తో నిరసన తెలిపారు.

భాషా సాహిత్య సంస్కృతులను పరివ్యాప్తం చేసుకోవాలి : రామచంద్రరావు

పురస్కార గ్రహీతలతో రామచంద్రరావు, శివారెడ్డి, చెన్నయ్య, రామమూర్తి, శ్రీనివాసాచార్య తదితర అతిథులు

నాంపల్లి, మార్చి 17 ప్రభాతవార్త : నేటి అత్యాధునిక కృత్రిమమేథా వంటి సాంకేతిక పరిజ్ఞానయుగంలో తెలుగుభాష మౌలిక అంశాలను పరిరక్షించుకుంటూనే భాషా సాహిత్య సంస్కృతులను పరివ్యాప్తం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అన్నారు. తెలుగుభాషను చిన్నచూపు చూస్తున్న కలంలో ఏర్పడిన సారస్వత పరిషత్తు మంచి కార్యక్రమాలు నిర్వహించడం హర్షదాయకమన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 8 మంది ప్రముఖులకు పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన బొగ్గులకుంట సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో జరిగిన సభకు ఎన్.రామచంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆత్మీయ అతిథులు డా. తిరుమల శ్రీనివాసాచార్య, మడుపు ప్రభాకరరావు, బి.గోపాలకృష్ణ, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య తదితరులతో కలిసి తెలంగాణ సారస్వత పరిషత్తు ధర్మనిధి పురస్కారాలకు ఎంపికైన గోపదాని రవీందర్‌కు డా. తిరుమల శ్రీనివాసాచార్య పురస్కారం; శైలజామిత్రకు తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కారం; తుమ్మల వేదరావుకు డా. బిఎన్.శాస్త్రి పురస్కారం; డా. చీదెళ్ళ సీతాలక్ష్మికి ఆచార్య మడుపు కులశేఖరరావు పురస్కారం; కాసర్ల నరేష్‌రావుకు నారపరాజు రాఘవసీత పురస్కారం, పెద్దిరెడ్డి గణేష్‌కు బూర్గుల రంగనాథరావు పురస్కారం, బండారు విజయకు డా. కె.అంజిరెడ్డి పురస్కారం, వేదార్థం మధుసూదన శర్మకు తిరుకోవల్ శ్రీలక్ష్మి పురస్కారంతోపాటు ధర్మనిధి పురస్కారం కింద ఒక్కొక్కరికి 5వేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. సభకు జె.చెన్నయ్య స్వాగతం పలుకగా పరిషత్తు కార్యక్రమ సమన్వయకర్త రింగు రామమూర్తి నిర్వహించారు.

ఫీల్‌ఖానా సెక్షన్ పరిధిలో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఎఇ కార్యాలయంలో కూత వేటు దూరంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

బేగంబజార్,మార్చి 17 ప్రభాతవార్త: బేగంబజార్ డివిజన్ పరిధిలోని ఫీల్‌ఖానా,ఎఇ కార్యాలయం ఎదురుగా ఉన్న తోఫ్‌ఖానా,చేపలమార్కెట్ వెళ్లే రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్లు చుట్టు కంచెలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా ట్రాన్స్‌ఫార్మార్లు అనుకుని వ్యాపారం చేస్తున్నారు.ఫీల్‌ఖానా ఎఇ సెక్షన్ పరిధిలోని అనేక చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు ప్రమాదకరంగా మారాయి.అసలే ఎండకాలం అధికారులు కేవలం కరెంట్ బిల్లులపై దృష్టి సారించడం తప్ప విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు చుట్టు కంచెలు ఏర్పాటు చేయించాలన్న ఆలోచన ఏమాత్రం కనిపించడంలేదు.పైన పేర్కొనబడిన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్లు ప్రమాదకరంగా ఉన్నాయి.ఫీల్‌ఖానా,తోఫ్‌ఖానా,సంతోష్‌దాబా,ప్రక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్లుకు కంచులు లేకపోవడంతో ప్రజలు భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది.ఫీల్‌ఖానా ప్రాంతంలో ఉన్నవిద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్ల వద్ద వ్యాపారులు ప్లాస్టిక్ కాగితాలు,చెత్తాచెదారాన్ని అక్కడ వేయడం మూలంగా గతంలో విద్యుత్ ప్రమాదం చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి.అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారు.అటు అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు అంటున్నారు.ఇప్పటికైనా బేగంబజార్ డివిజన్ ఇంజనీర్ స్పందించి విద్యుత్ చుట్టు కంచెలు ఏర్పాటు చేసే విధంగా ఎఇకి ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

-పాల్గొన్న అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్

డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ వార్షిక డైరీ 2026ను ఎస్సిడిడి అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ ఆవిష్కరించారు. మంగళవారం కమిషనర్ కార్యాలయంలోని అడిషనల్ డైరెక్టర్ ఛాంబర్‌లో డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ మాట్లాడుతూ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డైరీని రూపొందించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. డైరీ రూపకల్పన అంత ఆషామాషీ కాదని, భవిష్యత్తులో డైరీ కార్యచరణను ముందుగా చేపట్టాలని అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. సమగ్ర సమాచారంతో డైరీ రూపొందించడం అభినందనీయమన్నారు. జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సిడిడి స్టాఫ్ అందరికీ డైరీ ఉపయోగకరంగా ఉంటుందని, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ చేతుల మీదుగా డైరీ ఆవిష్కరణ జరగటం పట్ల అసోసియేషన్‌ను అభినందించారు. టిజి ఎస్సిడిడి ఎంఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ చరిత్రలో డైరీ రూపొందించేందుకు యావత్ రాష్ట్రంలోని 33 జిల్లాల మినిస్టీరియల్ స్టాఫ్ పడిన శ్రమ అంతా ఇంతా కాదని, వారి సహకారం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. నాలుగు నెలల శ్రమ ఫలితంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ 2026ను రూపొందించడం గర్వంగా ఉందని, ఈ క్రెడిట్ అంతా మినిస్టీరియల్ స్టాఫ్‌కే దక్కుతుందని అన్నారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా రూపొందించిన డైరీకి అడగగానే సందేశాలను పంపించి ప్రోత్సహించిన ముఖ్యమంత్రికి, ఎస్సీడిడి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు, సెక్రటరీ సభ్యసాచి ఘోష్‌కు, అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్, ఎస్సీ కార్పొరేషన్ విసి అండ్ ఎండి హనుమంత్ నాయక్ తదితరులకు పేరుపేరునా రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో కమిషనర్ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్, అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు పి.శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బలక్ష్మి, సీనియర్ సూపరింటెండెంట్‌లు అలీం, జి.బాలస్వామి రెడ్డి, ఈ.రత్నాకర్, జి.సంజీవ, వేణుగోపాల్, సాయి ప్రసన్న, కొమరయ్య, హెచ్ఓడి కార్యాలయ సీనియర్ స్టాఫ్ కళ్యాణ్ రామానంద్, సచిన్, రజని, రజిత, మేఘమాల, అశోక్, ప్రవీణ్, చంటి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యువతకు ఉన్నత విద్యామండలి కొత్త కోర్సులు

- యూజీ అండ్ పీజీ విద్యార్థుల కోసం 39 స్పెషల్ కోర్సులు

- టిసాట్ లైవ్ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

జూబ్లీహిల్స్, మార్చి 17, ప్రభాతవార్తః తెలంగాణ యువత కోసం ఉన్నత విద్యామండలి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఆధునిక సాంకేతికతకు అనుసంధానం చేస్తూ కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. యూజీ అండ్ పీజీ కోర్సెస్ న్యూ అండ్ ఎమర్జింగ్ ఏరియాస్ అనే అంశంపై మంగళవారం టిసాట్ వేదికగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తాము ప్రతిపాదించే కొత్త కోర్సులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తెలంగాణలోని అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం సుమారు 39 ప్రత్యేక కోర్సులకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి విజన్‌లో భాగమైన 2047 లక్ష్యాన్ని పూర్తి చేసే ప్రయత్నంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులను రూపొందించామన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు 19 కోర్సులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం మరో 10 కోర్సులను తక్షణమే ఉపాధి కల్పించేవిగా ఆచరణలోకి తీసుకురానున్నామని, ఏఈడీపీ(అప్రెంటీస్ ఎనేబుల్డ్ డిగ్రీ ప్రోగ్రామ్స్)లో భాగంగా మరో 10 కోర్సులు ప్రవేశపెడుతామని స్పష్టం చేశారు. 2030 సంవత్సరానికీ మూడు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో తెలంగాణాలోని వివిధ రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఏర్పడే అవకాశాలున్నాయని, ఆ ఉద్యోగాలను సాధించేందుకు తెలంగాణ యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతో ఉన్నత విద్యామండలి పనిచేస్తుందని వివరించారు. కళాశాలల్లో క్వాలిటీ టీచింగ్, మానిటరింగ్, అకాడమిక్ పార్టిసిపేషన్, పరిశోధన తదితర అంశాలను తప్పనిసరిగా పాటించాలని చైర్మన్ సూచించారు. వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, డాటా సైన్స్ వంటి ప్రత్యేక కోర్సులలో విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించే ప్రయత్నంలో భాగంగా యూనివర్సిటీలకు, ఆయా కళాశాలకు తగిన సలహాలుసూచనలు అందిస్తున్నామన్నారు. మండలి మరో వైస్ ఛైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడంతో పాటు నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. నైపుణ్యం లేని చదువువల్ల ప్రయోజనం, ఉపాధి రెండూ ఉండవన్నారు. కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ మాట్లాడుతూ యూనివర్సిటీ లేదా కళాశాల తాము నిర్వహించే కోర్సులకు సంబంధించి ఖచ్చితంగా ల్యాబ్స్ నిర్వహించాలని సూచించారు. కొత్త కోర్సులు ప్రారంభించి వదిలివేయడమే కాకుండా వాటిపై తప్పని సరిగా తమ వైపు నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వ భూమిని కాపాడిన అధికారులు

-ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన స్థానిక నేతలు

అత్తాపూర్ మార్చి 18, ప్రభాతవార్త : అత్తాపూర్‌లోని రాంబాగ్ సర్వే నంబరు 354/1, 354/2, 354/3లలో 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవతో హైడ్రా కాపాడింది. మంగళవారం రాంబాగ్, పాండురంగ నగర్, హుడా కాలనీ, అత్తాపూర్, నంది ముసలైగూడ, హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి, శాంతి నగర్ ప్రాంతాల ప్రజలు , భక్తులు దుర్గానగర్‌లోని నివాసంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసి శాలువా సత్కరించారు.తమ పోరాటానికి మద్దతుగా నిలిచి అధికారులతో మాట్లాడి ప్రభుత్వ భూమిని రక్షించే విధంగా కృషి చేసినందుకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పట్టుదలతో సంబంధిత అధికారులకు సరైన సూచనలు చేసి ఆక్రమణలను తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఫలితం సాధ్యమైందని పేర్కొన్నారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో మ్యాడం మధు,కాంగ్రెస్ నేతలు సామ ఇంద్రపాల్ రెడ్డి, అమరేందర్ రెడ్డి,భాస్కర్ గౌడ్,సురేష్ రెడ్డి,బిజెపి నేతలు మల్లారెడ్డి,కోమరయ్య,విజయ్,వెంకట్ రెడ్డి,బంటీ రాజు,గణేష్ ,అమర్ రెడ్డి,టిడిపి నేత రామేశ్వర్ రావు,బిఆర్ఎస్ నేతలు వనం శ్రీరామ్ రెడ్డి,కొలను సుభాష్ రెడ్డి,బాస్తీ వాసులు రాజు పహీల్వాన్,తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

తెలంగాణ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ డీఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించిన దృశ్యం

మెహిదీపట్నం, మార్చి 17,ప్రభాతవార్త : పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తాయని తెలంగాణ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ డీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి. చిరంజీవి అన్నారు. సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషకరమని, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో టీఎస్‌సీపీఈ రాష్ట్ర కార్యదర్శి వల్లభనేని ప్రసాద్, డీఎస్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమోని వెంకటేష్ గౌడ్,ప్రతినిధులు ఇమ్రాన్, షకీల్ ఖాన్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు : ఎస్ఈ శ్రీనివాస్

మీరాలం ఈద్గాలో విద్యుత్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సౌత్ జోన్ ఎస్ఈ టి.శ్రీనివాస్

చార్మినార్,మార్చి 17 ప్రభాతవార్త : రంజాన్ పండుగ సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని చర్యలు తీసుకున్నామని టిజిఎస్‌పిటిసిఎల్ సౌత్ జోన్ ఎస్ఈ టి.శ్రీనివాస్ అన్నారు.చారిత్రక మీరాలం ఈద్గాతో పాటు మక్కామసీదులో రంజాన్ పండుగ రోజున వేలాది మంది ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించనున్నారు.కాగా ఎస్ఈ టి.శ్రీనివాస్ మంగళవారం చార్మినార్ డిఈ ఎం.శ్రీధర్,మీరాలం ఏడిఈ వెంకటేష్ గౌడ్‌తో కలిసి మీరాలం ఈద్గాలో విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక మీరాలం ఈద్గా లోపల ప్రాంతంతో పాటు బయట రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు,అదే విధంగా ప్రత్యేకంగా 315 కెవి సామర్థ్యం గల మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు.చారిత్రక మక్కామసీదులో ఉన్న నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు అదనంగా 500 కెవి సామర్థ్యం గల మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నెల కొల్పామని ఆయన తెలియజేశారు.ప్రజలు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు చేస్తే క్షేత్ర స్థాయిలోనే పరిష్కరిస్తారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫలక్‌నుమా ఏడిఈ రాజేందర్,మీరాలం ఏఈ శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

బిసి హాస్టల్ స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలి



బీసీ హాస్టల్ స్థలాన్ని కబ్జాలనుంచి కాపాడాలని అధికారులకు వినతి పత్రం అందిస్తున్న బస్తీ వాసులు

శేరిలింగంపల్లి,మార్చి 17 ప్రభాతవార్త శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపినగర్‌లోని మండల బీసీ బాలుర వసతి గృహం స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలని గోపినగర్, బాపునగర్,నెహ్రూనగర్ సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేవారు. ఈ మేరకు డిప్యూటి కలెక్టర్ ,శేరిలింగంపల్లి మండల తహశిల్దార్ మహిపాల్‌రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే,రంగారెడ్డిజిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి, డిప్యూటి డైరెక్టర్ కేశురాంలతో పాటు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌లకు వినతి పత్రాలు అందజేశారు. వసతి గృహం ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడం లేదని సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహానికి రక్షణ లేకపోవడంతో ప్రాంగణం కబ్జాలకు గురవుతుందని, ఇప్పటికై నా సంబందిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శేరిలింగంపల్లి బీసీ బాలుర వసతి గృహం స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. సదరు అధికారులకు వినతి సమర్పిం చిన వారిలో గోపినగర్,బాపునగర్,నెహ్రూనగర్ బస్తీవాసులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసి పరారైన భర్త

సంజీవరెడ్డి నగర్, మార్చి 17, ప్రభాతవార్త: భార్యను హత్య చేసి పరారైన భర్త సంఘటన సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సనత్ నగర్ ఇన్స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం సనత్ నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని జి. రేణుక (38), ఆమె భర్త నరేష్ (40) దంపతులు ఫతేనగర్‌లోని వాసవీ బృందావన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేసుకుంటూ కలిసి నివసిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. గత నాలుగు రోజులుగా రేణుక గుర్తు తెలియని వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడుతూ భర్త నరేష్‌తో గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య నరేష్ తన భార్య రేణుకతో గొడవపడి, ఆ గొడవలో కూరగాయల కత్తితో గొంతు కోసి హత్య చేసి పరారయ్యాడు. పిల్లలు బంధువులకు సమాచారం అందించగా, పోలీసులు క్లూ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బంగారు ఉంగరం కాజేశాడు.. నకిలీది పెట్టి వెళ్లాడు

- సీఎంఆర్ జువెలరీలో బయటపడిన వైనం

జూబ్లీహిల్స్, మార్చి 17, ప్రభాతవార్తః నగల దుకాణానికి కొనడానికి వచ్చినట్లు నటించిన ఒక వ్యక్తి బంగారు ఉంగరం కాజేసుకెళ్లిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. సోమాజీగూడలోని సిఎంఆర్ జువెలరీలో ఈ నెల 14న ఆడిటింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 10.820 గ్రాముల బంగారు ఉంగరం స్థానంలో నకిలీ బంగారు ఉంగరం ఉండటాన్ని గుర్తించారు. దీంతో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా 13వ తేదిన మధ్యాహ్నం మాస్క్ ధరించి వచ్చిన ఒక వ్యక్తి బాంగరు ఉంగరాలు కావాలంటూ వచ్చి బంగారు ఉంగరాన్ని కాజేసి దాని స్థానంలో నకిలీది పెట్టినట్లు గుర్తించారు. ఈ మేరకు స్టోర్ మేనేజర్ జ్యోతుల శ్రీనివాస్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ చెల్లింపు స్క్రీన్‌షాట్‌తో రూ. 73వేల ఉంగరం కాజేశాడు

జూబ్లీహిల్స్, మార్చి 17, ప్రభాతవార్తః జూబ్లీహిల్స్‌లోని వెగాశ్రీ జువెలర్స్‌ను మోసం చేసిన తరహాలోనే మరో నగల దుకాణాన్ని సైతం ఒక అగంతకుడు బురిడీ కొట్టించి రూ. 73వేల విలువైన ఉంగరాన్ని కాజేసిన సంఘటన ఇది. ఫిల్మ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్తిక్ అనే వ్యక్తి ఆన్‌లైన్ చాట్ ద్వారా జూబ్లీహిల్స్‌లోని నివేరా డైమండ్స్ దుకాణాన్ని సంప్రదించాడు. 14 క్యారెట్ల బంగారంతో ప్రత్యేకంగా తయారు చేసిన ఉంగరాన్ని ఆర్డర్ చేశాడు. దుకాణ యూపిఐ ఐడీకి రూ. 73వేల చెల్లింపుకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను పంపాడు. అది నిజమని నమ్మిన దుకాణ సిబ్బంది రింగ్ తయారుచేసి అమీర్‌పేటలోని ఏఏఏ మాల్ వద్ద అతనికి అందజేశారు. తరువాత బ్యాంకు ఖాతా పరిశీలించగా రూ. 73వేలు జమ కాలేదని గుర్తించారు. దీంతో మోసపోయినట్లు గ్రహించి స్టోర్ అకౌంట్స్ మేనేజర్ మహమ్మద్ షజైబ్ ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా కంపెనీ బస్సు బోల్తా

-పదిమందికి స్వల్ప గాయాలు

శేరిలింగంపల్లి,మార్చి 17 ప్రభాతవార్త నగర శివార్లలోని మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు ఫార్మా కంపెనీకి చెందిన మినీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనతో బస్సులో ప్రయణిస్తున్న 10 మంది ఉద్యోగులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలలోనికి వెళితే.. హైద్రాబాద్ లీ ఫార్మా కంపెనీకి చెందిన మినీ బస్సు ఉదయం కూకట్‌పల్లి నుంచి 10 మంది ఉద్యోగులతో గడ్డపోతారంలోని కంపెనీకి బయలుదేరింది. మార్గమధ్యంలో బాచుపల్లి సమీపంలోని ఓ మలుపు వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి పక్కకు బోల్తాపడింది. దీంతో బస్సులోని ఉద్యోగులందరూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబందించి మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పవిత్ర రంజాన్ మాసంలో బోరబండ సైట్1లో గ్రేటర్ మాజీ ఉప మేయర్ బోరబండ మాజీ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో సహేరి నిర్వహిస్తున్న దృశ్యం

కాంగ్రెస్‌సర్కారు ఇచ్చినహామీలను అమలుచేయాలి

-తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

కోహెడ, మార్చి 17, ప్రభాతవార్త :
బిజెపి రాష్ట్రకమిటీ పిలుపుమేరకు మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్‌ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధాలనపై, ఆరు గ్యారెంటీలు 420మోసాలపై నిరసన వ్యక్తంచేసి తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు జాలిగం రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి రెండుయేండ్లు గడిచి పోతున్న ఆరుగ్యారెంటీలను అమలుచేయడం పూర్తిగా విఫలమవుతుందన్నారు. రైతులకు రైతు భరోసా లేకుండా పోయిందన్నారు. రైతు భరోసా సకాలంలో అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయలేని కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత వస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, గుగ్గిళ్ల శ్రీనివాస్, ఖమ్మం రమేష్, రామంచ రాంచంద్రారెడ్డి, కొండబత్తిని సతీష్, జాలిగం సంపత్, అందవేని రాములు, గూడూరు కుమారస్వామి, ఎడమల రాజురెడ్డి, అమ్ముల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాగిళ్లాపూర్ సిసి రోడ్డునిర్మాణ పనులు ప్రారంభం

బెజ్జంకి, మార్చి 17, ప్రభాతవార్త:
మండల పరిధిలోని గాగిళ్లాపూర్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించ తలపెట్టిన సీసీ రోజు పనులను సర్పంచ్ ఎర్రల జానకి, ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, ఎంపిడిఓ ప్రవీణ్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు, కార్యదర్శి రాజేంద్రప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది అరెస్టు అప్రజాస్వామికం

పోలీసులు అరెస్టు చేసిన దశ్యం

బెజ్జంకి, మార్చి 17, ప్రభాతవార్త:
సమస్యలు పరిష్కరించాలని ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు తరలివెళ్లకుండా ముందస్తుగా అరెస్టుచేయడం అప్రజాస్వామికమని పంచాయతీసిబ్బంది తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బందిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల రూ.26 వేతనం చెల్లించాలి ఉద్యోగ భద్రత కల్పించాలని బోనగర లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధికి రూ.60లక్షలు నిధులు

సిదిపేట రూరల్, మార్చి 17, ప్రభాతవార్త:
గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.60 లక్షల రూపాయలు నిధులు మంజూరుచేసిందని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బచ్చాయిపల్లి, సీతారాంపల్లి గ్రామ అభివృద్ధిపనులను గ్రామనాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం ప్రేమలత యాదగిరి, ఉపసర్పంచ్ అనుపమ, మండలశాఖనాయకులు గుర్రం అంజిరెడ్డి, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బండి శివకుమార్, దేవిరెడ్డి రాజారెడ్డి, బాబురెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వార్డుసభ్యులు, కాంగ్రెస్‌నాయకులు రాజ బహదూర్‌రెడ్డి, అరవింద్, గ్రామస్థులు తదితరుల పాల్గొన్నారు.

ప్రాణరక్షణలో అగ్రగామి రామాయంపేట 108 అంబులెన్స్

రామాయంపేట, మార్చి 17, ప్రభాతవార్త:
అత్యవసర వైద్యసేవల్లో కీలకపాత్ర పోషిస్తున్న 108అంబులెన్స్ సిబ్బంది సేవలు రామాయంపేటలో ప్రశంసలు అందుకుంటున్నాయి. ఎక్కడినుంచైనా అత్యవసర కాల్ వచ్చిన వెంటనే స్పందించి రోగులను సమయానికి ఆసుపత్రికి తరలిస్తూ ప్రాణాలను కాపాడుతున్న ఘనత రామాయంపేట 108 అంబులెన్స్ సిబ్బందికి దక్కిందని ఉమ్మడి మెదక్ జిల్లా 108 అంబులెన్స్ మేనేజర్ సంపత్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న 108 అంబులెన్స్‌ను మంగళవార నాడు ఆయన పరిశీలించారు. అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న ఔషధాలు, అత్యవసర పరికరాలను తనిఖీ చేసి, సిబ్బంది నిర్వహిస్తున్న కేసులకు సంబంధించిన రికార్డులను సమీక్షించారు. ఈసందర్భంగా సంపత్ మాట్లాడుతూ, రామాయంపేట 108 అంబులెన్స్ సేవలు మెదక్ జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల కంటే మెరుగైన సేవలు అందిస్తూ ప్రతిరోజూ సుమారు 10 కేసులను ఆసుపత్రికి తరలించి అనేకమంది ప్రాణాలను కాపాడుతున్నారని తెలిపారు. అత్యుత్తమ సేవలను గుర్తించి రామాయంపేట 108 అంబులెన్స్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించే విధంగా పూర్తి నివేదికను జిల్లా అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు. అలాగే, వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు అవసరమైన మందులను ప్రతి 108 అంబులెన్స్‌లో సిద్ధంగా ఉంచుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 108 అంబులెన్స్ పైలట్ ఆసిఫ్, ఇఎంటి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యరక్షణలో ముందడుగు

రామాయంపేట, మార్చి 17, ప్రభాతవార్త:
బాలికల ఆరోగ్యరక్షణకు దోహదపడే కీలకకార్యక్రమంగా గర్భాశయ క్యాన్సర్ నివారణకు సంబంధించిన హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమం రామాయంపేటలో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్‌పర్సన్ నవనీత గణేష్‌తో పాటు కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులను ఆసుపత్రి సూపరిండెంట్ డ్యాక్టర్ లింబాద్రి, వైద్య సిబ్బంది శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, గుగులోత్ రవి, చౌదరి చరిత, పుట్టి సందీప్, శంకర్ గౌడ్, దేవుని రంజిత్, మద్దెల మాధవి రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, నాయకులు చింతల యాదగిరి, అల్లాడి వెంకటేష్, ఎనిశెట్టి అశోక్, సుంకోజు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

గూడులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

పాపన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:
రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న గృహనిర్మాణ పథకాలు గూడులేని నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఆరేపల్లి సర్పంచ్ రజితరాజశేఖర్, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్‌లు అన్నారు. మంగళవారం ఆరేపల్లిలో మహమ్మద్ అస్మిన్ బేగం ఇందిరమ్మ ఇళ్ళను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా మహమ్మద్ అస్మిన్‌బేగంకు ఇంటిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రేష్మ సలీం, కిసాన్‌సెల్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, వార్డుసభ్యులు విజయ్, నాయకులు, శంకర్‌రావు, శివాజీ, మారుతి, రాజు, విఠల్రావు, బాలాజీ రావు, రాములు తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమం

అక్కన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:
మండలంలోని రామవరం రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మకమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య హాజరై, మాట్లాడారు. అనంతరం ప్రకృతివ్యవసాయం చేస్తున్న రైతు లకు భూసారపరీక్షపత్రాలు, కిట్లు పంపిణీచేశారు. కార్యక్రమానికి ముందు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా శిక్షణకార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండలవ్యవసాయ అధికారి తస్లీమాసుల్తానా, సర్పంచులు బంధారం శ్రీని వాస్, బొమ్మ శ్రీశైలం, పోన్నాల ఎంకవ్వ, వెంకటేష్, ఉపసర్పంచులు గణేష్, లింగాల కనుకయ్య, స్వామి రెడ్డి, బంధారం రాజయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సారయ్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారి శ్రీలతతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలకు నీళ్లొదిలారు..

-పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు నరికివేసి నిర్మిస్తున్న భవనం
-చర్యలు తీసుకోవాల్సిన అధికారులే అండగా నిలుస్తున్న వైనం

చిలిపిచెడ్, మార్చి 17, ప్రభాతవార్త:
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పల్లె ప్రకృతివనంలోని మొక్కలను తొలగించి, అదే స్థలంలో భవనాన్ని నిర్మిస్తున్న ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోవడంలేదని, చర్యలు తీసుకోవాల్సిన మండల ఎంపీవో వారికే మద్దతు పలుకుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాదులు పెరుగుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని, నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు చెట్ల మద్య తిరగాలని, ప్రాణవాయువును పెంచాలనే ఉద్దేశ్యంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతివనాలను ఏర్పాటుచేసిన విషయం విదితమే. అయినప్పటికి ఇవేమి పట్టకుండా మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండల పరిధిలోని రాందాస్‌గూడ గ్రామంలో ప్రకృతి వనాన్ని తొలగించి వెలుగు గ్రామైక్యసంఘ భవననిర్మాణాన్ని చేపడుతున్నారు. వాస్తవానికి ఆభూమి చెరువుశిఖం భూమి. అలాంటి భూమిలో ఎలాంటినిర్మాణాలు చేపట్టిన కూలిపోయే ప్రమాదాలు ఉంటాయని, నిర్మాణాలు చేపట్టకూడదనే ప్రభుత్వ ఆంక్షలు ఉండడంతో గత పాలకులు పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. కానీ వాటిని లెక్కచేయకుండా ప్రస్తుత సర్పంచి ఇష్టానుసారంగా చెట్లను నరికివేసి భవన నిర్మాణం చేపడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పల్లె ప్రకృతివనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకొని సరైనస్థలంలో భవననిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.

ఈవిషయమై నర్సాపూర్ డీఎల్పీవో సాయిబాబను వివరణ కోరగా.. పల్లె ప్రకృతవనంలోని మొక్కలను తొలగించడం చట్టరీత్యా నేరం. శిఖంభూముల్లో నిర్మాణాలు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిర్మాణాలను నిలిపివేస్తాం అని డిఎల్పీఓ సాయిబాబా స్పష్టంచేశారు.

రాందాసుగూడలో పల్లె ప్రకృతివనంలో మహిళా సమాఖ్య భవనం నిర్మాణం చేపడుతున్న దృశ్యం

నీరులేక ఎండిపోతున్న వరిపంట-రైతు ఆవేదన

నీరు లేక ఎండిపోతున్న వరి దృశ్యం

అక్కన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:
అక్కన్నపేట మండలం కుందన్‌వానిపల్లి గ్రామంలో నీటి కొరతతో వరి పంట ఎండిపోతున్న ఘటన రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. గ్రామానికి చెందిన రైతు అన్నాడి అనంతరెడ్డి దాదాపు రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. అయితే భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోవడంతో పాటు బోరు బావి ఎండిపోవడంతో పంటకు నీరు అందక పొలం ఎండిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటకు ఇంకా 15 రోజులు మాత్రమే మిగిలి ఉండగా, నీటి లభ్యత లేకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోవడం బాధాకరమని తెలిపారు. చేతికి రావాల్సిన పంట ఎండిపోవడంతో అది ఇప్పుడు మూగజీవాలకు ఆహారంగా మారిందని రైతు వాపోయాడు. పెట్టుబడులు పెట్టిన రైతు నష్టపోయిన పరిస్థితిలో ప్రభుత్వం స్పందించి సహాయం అందించాలని కోరుతున్నారు.

అల్లాదుర్గంలో వడగండ్ల వాన

అల్లాదుర్గంలో పడుతున్న వడగండ్ల వాన దృశ్యం

అల్లాదుర్గం, మార్చి 17, ప్రభాతవార్త:
మండలంలోని ఆయాగ్రామాల్లో మంగళవారం సాయంత్రం గాలి దుమారంతో కూడిన వడగండ్ల వాన కురిసింది. వర్షం కురిసే కంటే ముందుగా పెద్ద పెద్ద వడగండ్లు పడటంతో ప్రజలు ఇండ్లకు చేరుకున్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంతోపాటు మండలపరిధిలోని చిల్వర్, మాందాపూర్, కాయిదంపల్లి, రెడ్డిపల్లి, వెంకట్రావ్‌పేట్, బహిరన్‌దిబ్బా, అప్పాజీపల్లి, గొల్లకుంట, గాండ్ల బావి గిరిజన తాండ, నడిపితాండ తదితర గ్రామాల్లో వడగండ్ల వాన భారీగా కురిసింది. పలుగ్రామాల్లో వర్షంకారణంగా విద్యుత్‌ను అధికారులు నిలిపేశారు. సోమవారం రాత్రి కరెంట్ లేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి వేళలో విద్యుత్ సరఫరా లేక ప్రజలు కంటి మీద కునుకు లేకుండా జాగరణ చేయాల్సిన దయనీద స్థితి నెలకొంది. విద్యుత్ అధికారులు స్థానంగా ఉండకపోవడంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు మండిపడుతున్నారు.

అక్కసు పెట్టుకొని ఎలా అడుగుపెడతావు..?

-రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాసిన మాజీమంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
సిద్దిపేట అభివృద్ధిపై అక్కసు పెట్టుకొని ఎట్లా అడుగు పెడతావు సిఎం రేవంత్‌రెడ్డి....సిద్దిపేటపై ఎందుకింత కక్ష అని..నువ్వు ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా సిద్దిపేటపై ఈర్ష్యాద్వేషాలేనా అని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రశ్నించారు. ఈనెల22న నంగునూర్‌మండలం నర్మెట గ్రామంలో అయిల్‌పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించడానికి విచ్చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన బహిరంగలేఖ రాశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కోసం విడుదలైన రూ.1,070 కోట్ల నిధులు ఎందుకు రద్దుచేశావని ప్రశ్నించారు. ఆనిధులు పునరుద్దరించిన తర్వాతనే సిద్దిపేట నియోజకవర్గంలో అడుగుపెట్టాలన్నారు. సిఎంగా బాధ్యతలు చేపట్టిన 27నెలల తర్వాత అధికారికంగా సిద్దిపేట నియోజకవర్గంలో అడుగుపెడుతున్నందుకు ఈ ప్రాంత ఎమ్మెల్యేగా స్వాగతిస్తున్నాను. కానీ సిద్దిపేట అభివృద్ధిపై ప్రదర్శిస్తున్న ఈర్ష్యాద్వేషాలను నియోజకవర్గ ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారని లేఖలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వెటర్నరీ కళాశాల, రంగనాయకసాగర్ టూరిజం,కోమటిచెరువు శిల్పారామం, సిద్దిపేట నియోజకవర్గ ఔటర్ రింగ్ రోడ్డు, తోర్నాల బిఎస్సీ అగ్రికల్చర్ కళాశాల, క్రీడాల కోసం స్పోర్ట్స్ హబ్ సిద్దిపేట ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు, బ్లాక్ ఆఫీస్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు నిలిపివేశారని లేఖలో వివరించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

-బిజెపి మండల అధ్యక్షులు భూక్య సంపత్

హుస్నాబాద్ టౌన్, మార్చి 17, ప్రభాతవార్త
రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని భారతీయ జనతా పార్టీ నాయకులు విమర్శించారు. రాష్ట్ర బీజేపీ ఆదేశాలమేరకు హుస్నాబాద్ మండల అధ్యక్షుడు భూక్య సంపత్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, మాజీ ఎంపీటీసీ కుంట మల్లయ్య, బూతగడ్డపు బాలరాజ్, కన్నె శంకర్, భాషవేణి వెంకటేష్, రత్నాకర్‌రెడ్డి, వంగ శ్రీనివాస్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు పుట్ట కొమురయ్య, మొరుగు రవీందర్, గంటల రాజేందర్, కొన్నబోయిన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై బిజెపి ఆగ్రహం

-చర్యలు తీసుకోవాలని డిమాండ్

రామాయంపేట, మార్చి 17, ప్రభాతవార్త:
రామాయంపేట పట్టణంలోని సిహెచ్‌సీలో నిర్వహించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఫోటో ప్రోటోకాల్ పాటించలేదని ఆరోపిస్తూ బిజెపి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్థానిక ఎంపీ రఘునందన్‌రావు చిత్రాలు ఫ్లెక్సీలలో లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలోనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బీజేపీ నాయకులు విమర్శించారు. ఇది అధికారయంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. అదేవిధంగా, కార్యక్రమానికి సంబంధించి స్థానిక ఎంపీకి సమాచారం ఇవ్వక పోవడాన్ని కూడా వారు తీవ్రంగా ఖండించారు. వెంటనే జిల్లాకలెక్టర్ జోక్యం చేసుకొని ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి ప్రోటోకాల్ ఉల్లంఘనలు కొనసాగితే కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరిస్తూ, అవసరమైతే కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్యగారి యాదగిరి పాల్గొన్నారు.

రామతీర్థంలో ఘనంగా ఎల్లమ్మ కళ్యాణం

-బోనమెత్తిన జోగిని రాధిక.. హాజరైన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీ

పాపన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:
పాపన్నపేట మండల పరిధిలోని రామతీర్థంలో మంగళవారం మాజీ సర్పంచ్ అనూరాధబాబాగౌడ్ ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ కళ్యాణం కనులపండుగగా జరిగింది. అనంతరం ఎల్లమ్మతల్లికి బోనాలుతీసి కల్యాణంచేపట్టగా జోగిని రాధిక ఏడంతస్తుల బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్ళతో, యువకుల నృత్యాలతో, పోతరాజుల విన్యాసాలమధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించగా, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ షేరీ సుభాష్‌రెడ్డి, కంటారెడ్డి తిరుపతిరెడ్డిలు హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారివెంట రామతీర్థం సర్పంచ్ సాయిరెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుమ్మరి జగన్నాథం, మాజీ సర్పంచ్లు తిమ్మయ్యగారి గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, ఏడుపాయల మాజీచైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బాలగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సమీక్షాసమావేశం నిర్వహించిన ఎంపిడివో

పెద్దశంకరంపేట, మార్చి 17, ప్రభాతవార్త:
మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నాడు ఎంపీడీవో క్రాంతికుమార్ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో క్రాంతికుమార్ మాట్లాడుతూ నర్సరీల నిర్వహణ, పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా ఈజీఎస్ పనుల పురోగతి, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కూడా సలహాలు సూచనలు చేశారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంతో పూర్తి చేయాలని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ళను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపి ఓ జాకీర్ హుస్సేన్, హౌసింగ్ ఏఈ కౌశిక్, ఏపీవో సంతోష్ కుమార్, ఈసీ నవాజ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన

వసతి సముదాయాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ నవీన్ నికోలస్, జిల్లా కలెక్టర్ హైమావతి

మర్కుక్, మార్చి 17, ప్రభాతవార్త:
రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటులో భాగంగా మంగళవారం మండలకేంద్రమైన మర్కుక్‌లో అనువైనస్థలాలను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ ఐఎఎస్, సిఎం కార్యాలయ అధికారి అజిత్‌రెడ్డి, టిఎస్‌డబ్ల్యూఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ గణపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా మర్కుక్‌లో పోలీస్ క్వార్టర్స్ కోసం నిర్మించిన వసతి సముదాయాలను పాఠశాల స్థలంగా అనుకూలమా, కాదా అనే కోణంలో పరిశీలించారు. భవనాల వినియోగం, అవసరమైన మౌలిక వసతులు, విద్యావాతావరణానికి అనుకూలతవంటి అంశాలపై అధికారులు సమగ్రంగా అంచనావేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతి సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై పాఠశాల ఏర్పాటు పనుల పురోగతిపై సమీక్షించారు. అవసరమైన ప్రతిపాదనలు, ప్రణాళికలను తక్షణమే సిద్ధంచేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైనవిద్య అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తుందని అధికారులు తెలిపారు. త్వరలోనే పాఠశాల ఏర్పాటు పనులు ప్రారంభం కానున్నట్లు సమాచారం.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హుస్నాబాద్ రూరల్, మార్చి 17, ప్రభాతవార్త:
మొక్కజొన్న రైతుల సౌకర్యార్థం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర రవాణా. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. మొక్కజొన్న కొనుగోలు అంశంపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడి రైతులు పండించిన మొక్కజొన్న అమ్మకంలో ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలుకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో మంగళవారం హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, పిఎసిఎస్ మాజీ చైర్మెన్ శివయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మరియు మార్క్‌ఫెడ్ అధికారులు కలిసి మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే పూర్తిస్థాయిలో మొక్కజొన్న కొనుగోలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులు ఆందోళనచెందాల్సిన అవసరంలేదని ఆయన స్పష్టంచేశారు.

ఒకరోజు దీక్షచేపట్టిన బిజెపి డివిజన్ అధ్యక్షులు

జిన్నారం, మార్చి 17, ప్రభాతవార్త:
కాలుష్య ప్రాంతమైన బొల్లారంలో ఉచితంగా మంచినీటి సరఫరా చేయాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి ఒకరోజు దీక్షను మంగళవారం పాత పంచాయతీ కార్యాలయం ఎదుట చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య బారిన పడి, భూగర్భ జలాలు సైతం కాలుష్య కారకాలుగా మారాయని, కాలుష్య ప్రభావం ప్రాంతాలలో ఉచితంగా తాగునీటిని అందించాలని సుప్రీంకోర్టు ఆర్డర్ ఇచ్చిందని దాన్ని వెంటనే అమలుచేయాలని ఆయన కోరారు. మంగళవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు సి. గోదావరి అంజిరెడ్డి హాజరై నిమ్మరసం అందచేసి ఒకరోజు దీక్షను విరమించాలని కోరారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు టీ. రవీందర్ రెడ్డి,సంగారెడ్డి జిల్లా మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి టీ. మేఘన రెడ్డి, సీనియర్ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, శ్రీకాంత్ చారి,సమ్మయ్య, శివ, దిలీప్ కుమార్,అరుణ్, కిషోర్‌చారి, విష్ణుచారి, లక్ష్మీదేవి, సంతోష్, యశ్వంత్, సురేష్, ధనుంజయ్, ప్రధాన కార్యదర్శి అఖిల్ కుమార్, మోహిత్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్ నివారణలో హెచ్‌పివి టీకా

-జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.శ్రీరామ్

రామాయంపేట, మార్చి 17, ప్రభాతవార్త:
గర్భాశయ క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ టీకా కీలకపాత్ర పోషిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.శ్రీరామ్ అన్నారు. రామాయంపేట సిహెచ్‌సీలో బాలికల ఆరోగ్యరక్షణకోసం హెచ్‌పీవీ(హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డా.శ్రీరామ్ సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డ్యాక్టర్ లింబాద్రి, డీఐఓ డ్యాక్టర్ మాధురి, వైద్య సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సహస్రను అభినందించిన కౌన్సిలర్ మాణెమ్మ


సహస్రను అభినందిస్తున్న కౌన్సిలర్ మాణెమ్మ

సదాశివపేట, మార్చి 17, ప్రభాతవార్త:
భైంసాలో నిర్వహించిన ఖేలో ఇండియాలో గోల్డ్‌మెడల్ సాధించిన నందిగారి సహస్రను వారి తల్లిదండ్రులు సంతోష్, మంజులను మంగళవారం సదాశివపేట 6వవార్డు కౌన్సిలర్ మాణెమ్మ, బిఆర్‌ఎస్ నాయకులు నాగుల విజయ్‌కుమార్‌లు శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం కౌన్సిలర్ నాగుల మానెమ్మ మాట్లాడుతూ సహస్ర భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే వీరశైవసంఘం ఆధ్వర్యంలో సహస్రను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం జిల్లా గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్‌స్వామి, ప్రధాన కార్యదర్శి కె.నురేందర్, ఉపాధ్యక్షులు మధు, గాండ్ల కృష్ణ, సంగిశెట్టి, రమేష్, బసవరాజ్, విజయ్‌కుమార్, స్వరూప, వీరమని తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

నార్సింగి, మార్చి 17, ప్రభాతవార్త:
నార్సింగి మండల వ్యాప్తంగా రైతులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద పంపిణీ చేసే రైతు భరోసా కోసం కొత్త పట్టా పాస్ పుస్తకం కలిగిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి భరత్ కుమార్ సూచించారు.ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం రైతు పెట్టుబడి కింద అందించే రైతు భరోసా కోసం ఫిబ్రవరి 28.2026 వరకు కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులతో పాటు ఇప్పటివరకు రైతు బంధు భరోసా పొందని అర్హులైన రైతులు,వివరాలు నమోదు చేయని రైతులు వెంటనే రైతు వేదికల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ దరఖాస్తులు ఈ నెల 28 వరకు సమర్పించాలని అన్నారు. దరఖాస్తు పత్రంతో పాటు పట్టా పాస్ బుక్,ఆధార్ కార్డు,బ్యాంకు పాస్ బుక్, సంబంధిత పత్రాలు తీసుకురావాలని తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్...

-మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాపన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:
పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలో ఉండే మైనార్టీ సహోదరుల కోసం ఏర్పాటుచేసే ఇఫ్తార్‌విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని మెదక్‌ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన మంజీరా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పావని నరేందర్‌గౌడ్, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ అధ్య క్షుడు గోవింద్‌నాయక్, మాజీ కోప్షన్ సభ్యులు గౌస్,ఉప సర్పంచ్ సద్దాం హుసేన్, వార్డుసభ్యులు, మైనార్టీలు ఆఫీస్ మొల్సాబ్, ఖుర్షీద్, మాజీ ఉప సర్పంచ్ ఖాళీం,చోటు,సూఫీ, అప్సర్, ఇబ్రాహీం, షాహిద్ పాషా, తోపాటు నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

హెడ్‌కుక్ పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

సదాశివపేట, మార్చి 17, ప్రభాతవార్త:
పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వంటచేయడానికి పోస్టు ఖాళీగా ఉందని అర్హతగల అభ్యర్థులు ఈనెల శుక్రవారం మార్చి నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోగలరని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లలిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు కనీస విద్యార్హత పదవ తరగతి పాస్ అయి ఉండాలని, వయసు 35సంవత్సరాల లోపు ఉండాలని ఆమె అన్నారు. మరిన్ని వివరాల కోసం 9133696309 నెంబర్‌కి ఫోన్ చేయగలరని ఆమె తెలిపారు.

నేటి నుంచి కమనీయంగా కాశీనాథుడి జాతర

-ముస్తాబైన ఆలయం, రథం



ఆలయంలో కొలువున్న శ్రీకాశీ విశ్వేశ్వరుడు

చౌటకూరు, మార్చి 17, ప్రభాతవార్త:

మండలకేంద్రమైన చౌటకూరులో శ్రీ అన్నపూర్ణాదేవితో కొలువున్న శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయం ఉగాది పర్వదినాలను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే ఉత్సవాలకు ఆలయం ముస్తాబయింది.

నేటి నుంచి జరిగే జాతర కార్యక్రమాలు...

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీపరాభవనామ చైత్ర శుద్ధపాడ్యమితో (ఈ నెల 19న) జాతర ప్రారంభమై తదియతో ఉత్సవాలు (ఈ నెల 21న) ముగుస్తాయి. 19న ఉదయం ధ్వజారోహణం, అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. సాయంత్రం 3 గంటలకు పంచాంగ శ్రవణం, బండ్లు తిరుగుట, స్వామివారి రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 20న సాయంత్రం 4 గంటలకు పోచమ్మ, దుర్గమ్మ గ్రామదేవతలకు బోనాలు, రాత్రికి అగ్నిగుండాలు ఉంటాయన్నారు. 21న గోపాల కాల్వలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి పాచిబండ్లు తిరుగుట, రాత్రికి రథము తిరిగివచ్చుట, లంకాదహనం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తీర్థాల రామకృష్ణ తెలిపారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

మునిపల్లి, మార్చి 17, ప్రభాతవార్త:

మునిపల్లి మండలం హైద్లాపూర్‌లో అక్రమ షెడ్డు నిర్మాణం చేపడ్తున్నారని గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 52 సర్వే నెంబరులోగల ప్రభుత్వభూమిలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా కొందరు వ్యక్తులు అక్రమంగా షెడ్డు నిర్మించడంపై తాను మండల తహసీల్దారుకు, పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. అక్రమషెడ్డు నిర్మాణంతో గ్రామస్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తాను వారి దృష్టికి తీసుకుపోయినా, ఇప్పటివరకు షెడ్డును తొలగించడానికి చర్యలు తీసుకోవడంలేదని గ్రామ సర్పంచి రమేష్ ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ప్రభుత్వభూమిలో నిర్మించిన షెడ్డును వెంటనే తొలగించి గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇక్కట్లను తీర్చాలని, లేనియెడల జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పెద్దచెల్మెడలో శెనగల కొనుగోలుకేంద్రం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్మన్ సుధాకర్‌రెడ్డి

మునిపల్లి, మార్చి 17, ప్రభాతవార్త:

మునిపల్లిమండలం పెద్దచెల్మెడ పిఏసిఎస్‌లో మార్కెఫ్డ్ ఆధ్వర్యంలో శెనగల కొనుగోలుకేంద్రాన్ని ఎఎంసి చైర్మన్ ఎం.సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, శెనగల కొనుగోలుకేంద్రం ఏర్పాటుతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఎడిఎ సత్యనారాయణ, పిఏసిఎస్ సెక్రటరీ శివారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయండి

-జోనల్ కమిషనర్‌తో మాజీ కార్పొరేటర్ సింధు

జోనల్‌కమిషనర్ హేమంత్‌కు వినతిపత్రం అందచేస్తున్న సింధు

రామచంద్రాపురం, మార్చి 17, ప్రభాతవార్త:

భారతీనగర్‌డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధిపనులను వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి మంగళవారం జోనల్ కమిషనర్ హేమంత్‌కు సూచించారు. తన వినతులను సానుకూలంగా విన్న కమీషనర్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు.

ముస్లింలకు రంజాన్ కానుకగా బట్టల పంపిణీ

అక్కన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అక్కన్నపేట మండల కేంద్రంలో ముస్లింలకు బట్టలను కానుకగా పంపిణీచేశారు. గ్రామ సర్పంచి జన్నారపు సంపత్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి జన్నారపు సంపత్ మాట్లాడుతూ రంజాన్ పండుగ సోదరభావం, సహకారం, పరస్పర గౌరవానికి ప్రతీక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి లంబ శ్రీలేఖమహేందర్, వార్డ్‌మెంబర్ మాజీ సర్పంచి ముత్యాల సంజీవరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ జంగంపల్లి ఐలయ్యతోపాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక ముస్లింలు పెద్దసంఖ్యలో హాజరై పంపిణీ కార్యక్రమంలో బట్టల కానుకను స్వీకరించారు.

డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్ కీలకం

-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 17, ప్రభాతవార్త:

ప్రస్తుత డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కృత్రిమ మేధస్సు ద్వారా తయారవుతున్న కంటెంట్, తప్పుదారి పట్టించే చిత్రాలు, తప్పుడు సమాచారాన్ని గుర్తించి నిజమైన వార్తలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఆమె అన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లాపరిషత్ సమావేశమందిరంలో జర్నలిస్టులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పిఐబి అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతిపాటిల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి వర్క్‌షాప్‌ను ప్రారం భించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు 130 మంది జర్నలిస్టులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ తరహా వర్క్‌షాప్‌లు జర్నలిస్టులు నూతన పరిజ్ఞానాన్ని తెలుసుకుని తమ వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. పిఐబి అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతిపాటిల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వశాఖల అధికారిక సమాచారాన్ని ప్రజలకు కచ్చితంగా చేరవేయడంలో పిఐబి కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. జర్నలిజంలో ఎఐ వినియోగంపై సత్యప్రియ వివరించారు. వర్క్‌షాప్ ముగింపులో జర్నలిస్టులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు పిఐబి అదనపు డైరెక్టర్ జనరల్ సమాధానాలు ఇచ్చి, వారి సూచనలు, అభిప్రాయాలను సంబంధిత మంత్రిత్వశాఖలకు చేరవేస్తామని హామీ ఇచ్చారు.

సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం పత్రిక ఆవిష్కరణ

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొమురవెల్లి, మార్చి 17, ప్రభాతవార్త:

కొమురవెల్లి మండలకేంద్రంలో సీతారామచంద్రస్వామి కళ్యాణమహోత్సవం పత్రికను మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈకార్యక్రమం గ్రామసర్పంచి గొల్లపల్లి పద్మాంజనేయులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పత్రికను ఆవిష్కరించారు. సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్థులు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సర్పంచి పిలుపునిచ్చారు. మహోత్సవ ఏర్పాట్లపై గ్రామస్థులు చర్చించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామంలో భక్తి వాతావరణం నెలకొని, ఈ మహోత్సవం విజయవంతంకావాలని గ్రామప్రజలు ఆకాంక్షించారు.

కొమురవెల్లి బ్రహ్మోత్సవాలు విజయవంతం..

-పోలీసుల ప్రత్యేక పూజలు

ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పోలీసుల దృశ్యం

కొమురవెల్లి, మార్చి 17, ప్రభాతవార్త:

కొమురవెల్లి మల్లన్నస్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీమల్లికార్జున స్వామి వార్షికబ్రహ్మోత్సవాలు సంక్రాంతి నుండి ఉగాది వరకు ఘనంగా జరిగి సోమవారంతో విజయవంతంగా ముగిశాయి. ఈసందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మూడునెలలపాటు ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేశారు. బ్రహ్మోత్సవాల సమాప్తి సందర్భంగా మంగళవారం హుస్నాబాద్ ఎసిపి సౌదారపు సదానందం, చేర్యాల సిఐ రమేష్‌నాయక్, ఎస్ఐ తోట మహేష్, పోలీస్‌సిబ్బంది స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగియడం పట్ల వారు ఆనందం వ్యక్తంచేస్తూ భక్తుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

6వతరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివపేట, మార్చి 17, ప్రభాతవార్త:

సదాశివపేటపట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2026-27 విద్యాసంవత్సరానికిగాను ఇంగ్లీష్ మీడియం ఆరవతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి, బిపిసిల్లోచేరే విద్యార్థులనుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లలిత ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 16నుండి వచ్చేనెల 15వతేదీలోపు రూ.200 దరఖాస్తు రుసుముతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మే మూడవతేదీన ప్రవేశపరీక్ష ఉంటుందని స్పెషల్‌ఆఫీసర్ లలిత తెలిపారు. వివరాలకు 9133696309 నెంబర్‌లో సంప్రతించాలని తెలిపారు.

మంజీరలోకి గణపతి చక్కెర పరిశ్రమ వ్యర్థజలాలు

-నదిలో భారీ సంఖ్యలో చేపల మృతి

మంజీరానదిలో చేపలు మృతిచెందిన దృశ్యం

చౌటకూరు, మార్చి 17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని వెండికోలు గ్రామ శివారులో ప్రవహిస్తున్న మంజీరానదిలోకి గణపతి చక్కెర పరిశ్రమ మొలాసిస్ వ్యర్థజలాలను వదలడంతో నీరు కలుషితమై నదిలోని చేపపిల్లలు భారీసంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రెండురోజులక్రితం పరిశ్రమవారు వ్యర్థజలాలను నదిలోకి వదలడంతోనే చేపలు మృతిచెందాయని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నదికి ఎగువన ఉన్న కర్మాగారంలో చెరకు క్రష్షింగ్ నిలిచిపోవడంతో వ్యర్థజలాలను పూర్తిగా మంజీరానదిలోకి వదిలేశారు. మొలాసిస్ తయారు చేసిన అనంతరం వెలువడిన వ్యర్థజలాలను వదలడంతోనే చేపలు మృత్యువాతపడ్డాయని ప్రజలు మండిపడుతున్నారు. మంజీరలో నీరు కలుషితం కావడంతో తాగేందుకు అవకాశం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల కిలోల బరువుగల వివిధ రకాల చేపలు కుప్పలుతెప్పలుగా 10క్వింటాళ్ల వరకు చేపలు మృతిచెంది నీళ్లపై తేలియాడుతున్నాయని విచారం వ్యక్తంచేస్తున్నారు. శివంపేట పాత వంతెన వద్ద నుంచి మొదలుకొని గొడిచర్ల శివారువరకు నదిజలాలు పూర్తిగా రంగుమారి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని ప్రజలు పరేషాన్ అవుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి వ్యర్థజలాలు విడుదలచేస్తున్న గణపతి చక్కెర కర్మాగార యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని, ప్రజల, మూగజీవాల ప్రాణాలు కాపాడాలని ప్రజలు వినతిచేస్తున్నారు.

మండల రెవిన్యూ కార్యాలయం వద్ద బిజెపి నిరసన

డిప్యూటీ తదితరులకు మెమొరాండం అందజేస్తున్న బిజెపి నాయకులు

హత్నూర, మార్చి 17, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ పాలనకు నిరసనగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసనకార్యక్రమం చేపట్టి ఉప తహసీల్దార్‌కు మెమొరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బిట్ల మహేష్, అసెంబ్లీ కో-కన్వీనర్ ఎర్ర సతీష్‌రెడ్డి, ఖానాపూర్ సర్పంచి జైపాల్, ఉపసర్పంచి మహేష్, బిజెపినాయకులు చంద్రమోహన్‌రెడ్డి, పోచగౌడ్, రాజేష్, మల్లేష్, శ్రీశైలం, శేఖర్, పాండు, మల్లేష్, జనార్దన్, సోషల్‌మీడియా కన్వీనర్ సుధాకర్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈదుల గాలికి పంటలు నేలమట్టం

-రైతులకు తీవ్ర నష్టం

నేలమట్టమైన మొక్కజొన్న పంట దృశ్యం

అక్కన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:

అక్కన్నపేట మండలంలో సోమవారంరాత్రి వీచిన ఈదురుగాలులకు మొక్కజొన్న, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంట నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మండలంలోని కట్కూరు, మల్చేరు తండా, రామవరం, కేశనాయక్ తండా, దుబ్బ తండా తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నేలకూలగా, వరి పంటలో వడ్లు రాలిపోయి భారీనష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ముఖ్యంగా కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. ఈదురుగాలుల కారణంగా పంటలు నేలకూలి, వరి గింజలు నేలపై రాలిపోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి, రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

-ట్రైనీ ఐపిఎస్ అధికారి ఆయేషా ఫాతిమా

మాత్‌పల్లిలో మాట్లాడుతున్న ట్రైనీ ఐపిఎస్ అధికారిణి ఆయేషా ఫాతిమా

కొండపాక, మార్చి 17, ప్రభాతవార్త

ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ట్రైనీ ఐపిఎస్ అధికారిణి, కుకునూరుపల్లి ఇంచార్జి ఎస్సై ఆయేషా ఫాతిమా అన్నారు. మంగళవారం మాత్‌పల్లిలో సిసి కెమెరాలు ఏర్పాటుకోసం సర్పంచి బచ్చలి శ్రీలత ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా తొగుట సిఐ లతిఫ్‌తో కలసి ఆమె మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. నేరాలు జరిగిన చోట విచారణ వేగవంతంగా జరుగుతుందన్నారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామప్రజల సహకారంతో వారం రోజుల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకుంటామని ఆమెకు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి శేరుపల్లి లింగం, వార్డుసభ్యులు బోనాల అనిత, రుద్రారం లావణ్య, జుట్టు కృష్ణవేణి, పోచమైన నర్సింలు, మార్కుక్ నర్సింలు, అంగన్‌వాడీ టీచర్లు కనకవ్వ, మంజుల, విసిఒ మహిపాల్, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ముంగిలో రైతు శిక్షణ కార్యక్రమం

జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ రైతు శిక్షణ కార్యక్రమం దృశ్యం

న్యాల్‌కల్, మార్చి 17, ప్రభాతవార్త:

మండలపరిధిలోని రైతు వేదికలో మంగళవారం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంలో భాగంగా మండల పరిధిలోని రేజింతల్, వడ్డి గ్రామాలకు చెందిన 125 మంది రైతులకు ఫార్మర్ కిట్టులను పంపిణీచేసి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిజిటల్ పద్ధతిలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, అన్నదాతలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవినాష్ వర్మ, ఎఈఓలు సన్నిత్‌రెడ్డి, మాధవి, ఇనా, రేజింతల్, వడ్డి గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్ భవననిర్మాణంలో జాప్యం

-విద్యార్థులకు ఇబ్బందులు

హత్నూర, మార్చి 17, ప్రభాతవార్త:

హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ అభివృద్ధి కోసం ఓసాట్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా సుమారు రూ.85 లక్షలకు పైగా నిధులు మంజూరయినప్పటికీ, పాతభవనం కూలగొట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సంగారెడ్డి జిల్లా బిజెపి నాయకులు బిట్ల మహేష్ ఆరోపించారు. మంగళవారం ఆయన దౌల్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, పాత పాఠశాల భవనం కూల్చడానికి జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చినప్పటికీ, పాత శిథిల భవనం కూల్చకపోవడంతో పనులు ప్రారంభం కాలేకపోతున్నాయని ఆయన ఆరోపించారు. గదులకొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన గుర్తుచేశారు. ఎందుకోసం పాత భవనాన్ని తొలగించట్లేదో, జడ్‌పిహెచ్‌ఎస్ హైస్కూల్ పట్ల నిర్లక్ష్యధోరణి ఎందుకు అవలంబిస్తున్నారో ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆలస్యం అయితే ఈ నిర్మాణ ప్రాజెక్టు ఇతర మండలానికి వెళ్లిపోయే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బిట్ల మహేష్, రెండవ వార్డ్‌మెంబర్ హసాజి శ్రవణ్, కుమ్మరి హనుమంతు, బిజెపివైఎం నాయకులు రాజేష్, వంశీ పాల్గొన్నారు.

సిరిపురలో మహిళలకు మొబైల్ హెల్త్ క్యాంప్

హత్నూర, మార్చి 17, ప్రభాతవార్త:

సిరిపుర గ్రామంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, మెడ్వాన్ సంస్థల ఆధ్వర్యంలో మహిళల కోసం మొబైల్ హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ శిబిరంలో మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టారు. వైద్య నిపుణులు రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యత గురించి వివరించారు. లక్షణాలు కనిపించిన మహిళలకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి మచ్చ నరేందర్, వైద్యులు, గ్రామపెద్దలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని నిర్వాహకులు తెలిపారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

-రైతు సమస్యలపై అక్కన్నపేట ఎమ్మార్వోకు బిజెపి వినతి...

వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

అక్కన్నపేట, మార్చి 17, ప్రభాతవార్త:

బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అక్కన్నపేట మండల కేంద్రంలో బిజెపి నాయకులు ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమం మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రైతుబంధు అందజేయాలని, గత యాసంగి సీజన్‌లో సన్నాల ధాన్యానికి ప్రకటించిన రూ.500 బోనస్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్‌చేశారు. పసల్ బీమా అమలు చేసి పంట నష్టాలకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియాయాప్ కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి పట్టా పాస్‌బుక్ ఆధారంగా ఎరువులు అందజేయాలని, హామీలు అమలు చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు కర్ణకంటి నరేష్, వేణుగోపాల రావు, సంపత్, రవికుమార్, సరూప, రాజకుమార్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది ముందస్తు అరెస్టు

గ్రామ పంచాయతీ సిబ్బందిని అరెస్టుచేసిన పోలీసుల దృశ్యం

కొమురవెల్లి, మార్చి 17, ప్రభాతవార్త:

మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమానికి హాజరుకాకూడదనే నేపథ్యంలో గ్రామపంచాయతీ సిబ్బందిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పంచాయతీసిబ్బంది సంఘం మండల అధ్యక్షుడు బ్రహ్మోండ్లపల్లి పర్శరాములుసహా మండలనాయకులు రొడ్డ నర్సింలు, గోదాల మల్లేశం, సార్ల శ్రీనివాస్, అరవింద్, నరేష్, యాదగిరి తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ధర్నాకు వెళ్లకుండా నిరోధించేందుకు ఈచర్యలు తీసుకున్నట్లు సమాచారం. అరెస్టుల నేపథ్యంలో మండలంలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ

మునిపల్లి, మార్చి 17, ప్రభాతవార్త:

మునిపల్లి మండలంలోని బుధేరా రైతువేదిక వద్ద జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ రైతు శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, సత్యనారాయణ, టెక్నికల్ ఎడిఎ సరిత, అరుణోదయ ఎన్‌జిఒ ప్రతినిధి పద్మజ, ఎఈఒ అనితా, బుధేరా, పోల్కంపల్లి సర్పంచ్‌లు మల్లేశం, వీరేశం, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వం

-గజ్వేల్ ఇంచార్జి తూంకుంట నర్సారెడ్డి



వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద విలేకరులతో మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

కొండపాక, మార్చి 17, ప్రభాతవార్త:

రాష్ట్రంలోని ప్రజలకు ప్రభుత్వం మరింత మెరుగైన సేవలను అందించడానికే 99రోజుల ప్రణాళికను ప్రభుత్వం తీసుకొచ్చిందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం వెలికట్ట క్రాస్‌రోడ్డువద్ద అయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజాపాలన అన్నారు. కాంగ్రెస్‌పాలన అంటే పేదల ప్రభుత్వం అని విద్య, ఆరోగ్యం సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు గ్రామాల్లో పర్యటించాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించడంలో సిఎం రేవంత్‌రెడ్డి కృషి అభినందనీయమన్నారు. 99రోజుల ప్రణాళికతో ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేయడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డుల జారీప్రక్రియ నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ నెల 22వ నర్మేటలో ఆయిల్‌పామ్ కంపెనీ సిఎం చేతులమీదుగా ప్రారంభం జరుగుతుందన్నారు. సిఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గజ్వేల్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలివెళ్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొండపాక, కుకునూరుపల్లి మండలపార్టీల అధ్యక్షులు వారసి లింగారావు, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, అనంతుల నరేందర్, మంచాల చిన్న శ్రీనివాస్, రెడ్డమైన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.